మిసెస్' అంటూ పరిచయం చేసేవారు. వాళ్ళూ "ఫర్ హేవింగ్ ఎ ఛార్మింగ్ వైఫ్" అంటూ కంగ్రాట్యులేషన్ చేస్తూంటే ఇంటికి రాగానే "నిన్ను చూస్తే నా కెంతో గర్వంగా వుంది సత్యా!" అంటూ వూపిరి సలపకుండా ముద్దులలో ఉక్కిరి బిక్కిరి చేసేవారు. మీ ప్రేమానురాగాలకోసం ఈ అందం జీవితాంతం నన్ను అంటిపెట్టుకొని వుండేలా చేయమని భగవంతునికి మనసారా మ్రొక్కే దాన్ని. ఇప్పుడు ముగ్గురుపిల్లల తల్లిని పట్టుకుని ఇలాంటి మాటలు అంటున్నారు. అసలు నేను అందమయినదాన్ని అని మీరు పదిసార్లు అంటూంటే నిజం కాబోలు అనుకుండే దాన్ని. పెళ్ళికానప్పుడు నేను అందగత్తెనని నేను అనుకోనే లేదు. ఎవరువచ్చి చూసుకున్నా పిల్ల నచ్చింది. కాని అయిదు వేలు కట్నం కావాలి. లేకపోతే ఆరువేలు కట్నం అంటూ బేరాలు సాగించేవారు. మీరు కట్నం అక్కర్లే కుండా పెళ్ళిచేసుకుంటే నిజంగా నా అదృష్టం అని మురిసి పోయాను. కాని నా అందానికి మీరు పెళ్ళి అనే మంత్ర దండం ఆయుధంగా వుపయోగించారు అనుకోలేక పోయాను" అంది సత్యవతి.

మళ్ళీ కాసేపు వూరుకుని "మునుపు పెళ్ళి అయిన కొత్తలో నా అందం మీకు గర్వకారణం అయింది. ఇప్పుడు అమర్యాద కారణం అవుతోంది. ఆరేళ్ళు సంసారం సాగించేక మీకు నా అందంపట్ల ఏర్పడిన అభిప్రాయం ఇదన్న మాట అంది సత్యవతి. జగన్నాథం మాట్లాడలేదు. తలక్రింద రెండు చేతులు పెట్టుకుని ఆలోచనలోకి జారేడు. పిల్లలిద్దరూ

